సాక్షి
అనంతపురం
బుధవారం । 20 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.22,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,500 పలికాయి.



ఏసీబీ వలలో సబ్ రిజిస్ట్రార్

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ రిజిస్ట్రార్ దామోదర్ అలియాస్ దామోదర్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. 8లో

రంజాన్ వేళలు


బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.07



న్యూస్‌రీల్

నీచ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజం



అనంతపురం కార్పొరేషన్: టీడీపీ అధినేత చంద్రబాబు నీచ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారం కోసం బీజేపీ, జనసేనతో అనైతిక పొత్తు పెట్టుకున్నారన్నారు. ఇటీవల ఆ మూడు పార్టీలు నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిందన్నారు. ప్రధాని మోదీ పాల్గొన్న సభకు కూడా జనం కరువయ్యారన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఇవే పార్టీలు తిరుపతి వేదికగా మేనిఫెస్టో ప్రకటించి ఒక్క హామీ నెరవేర్చలేక పోయాయని విమర్శించారు. 2019 ఎన్నికల సమయంలో మళ్లీ ఈ మూడు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారని గుర్తు చేశారు. వీరి మోసాలను ప్రజలు నేడు నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేనలను బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

సమన్వయంతో పనిచేయాలి



పోలీసు అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన స్పెషల్ బ్రాంచి, లాఅండ్‌ఆర్డర్, సెబ్, ఏఆర్, సైబర్, ఐటీ కోర్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమష్టిగా సాగితేనే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలమన్నారు.ఎన్నికలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఆర్. విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీ ఆంథోనప్ప, సీఐలు ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

తాడిపత్రి అర్బన్: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని గుంతకల్లు డివిజన్ ఏడీఎఫ్‌ఎం సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. తాడిపత్రి రైల్వే స్టేషన్ 158 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్టేషన్‌లో 'మహోత్సవం' పేరుతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఏడీఎఫ్‌ఎం సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ 1866 మార్చి 19న ప్రారంభమైన తాడిపత్రి రైల్వే స్టేషన్ నేటి వరకూ ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషించిందన్నారు. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా స్టేషన్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ స్టేషన్ మాస్టర్లు జి.వెంకటేష్, ఎస్‌ఎండీ నౌషద్, పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి బాషా, తాడిపత్రి రైల్వే స్టేషన్ మేనేజర్ జి.అనిల్ పాల్గొన్నారు.

అమిలినేని.. ఇదేం పని!

బీటీపీ కాలువ మట్టి సొంత భవన నిర్మాణానికి తరలింపు

ఇది కళ్యాణదుర్గం పట్టణ పరిధిలో కుందుర్పి రోడ్డులోని రాధాస్వామి ఆశ్రమం ఎదురుగా టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు నిర్మిస్తున్న భవనం. దాదాపు 2 ఎకరాల్లో టీడీపీ కార్యాలయం, దాని వెనుక వైపు సొంత భవంతి నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం భూమిపై ఎర్రమట్టిని ఏకంగా పది అడుగుల ఎత్తు వరకూ పరిచారు. జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించేందుకు చేపడుతున్న కాలువ పనుల్లో భాగంగా తీసిన ఎర్ర మట్టిని అక్రమంగా ఇక్కడికి చేరవేయడం గమనార్హం.



- రూ. కోట్లు విలువ చేసే ఎర్ర మట్టి అక్రమ రవాణా
- భవంతి నిర్మిస్తున్న చోట భూమిని పది అడుగుల ఎత్తుకు పెంచిన వైనం
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజానీకం

అనంతపురం సెంట్రల్/కళ్యాణదుర్గం:కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సాగించిన మట్టి దోపిడీలో మరో కోణం వెలుగు చూసింది. తన సొంత కాంట్రాక్టు సంస్థ ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ ద్వారా చేసిన బాగోతం బయటపడింది. జీడిపల్లి–భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనుల్లో భాగంగా కొల్లగొట్టిన ఎర్రమట్టిని కళ్యాణదుర్గంలో తాను నిర్మిస్తున్న భవంతి కోసం వాడుకున్న వైనంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పది అడుగుల అక్రమ పునాది..

ఇటీవల కాలంలో ఎర్రమట్టికి భారీ డిమాండ్ ఏర్పడింది. ఇసుక తర్వాత ఎర్రమట్టే అధిక ధర పలుకుతోంది. రహదారులతో పాటు పలు నిర్మాణాలకూ ఎర్రమట్టి అవసరం ఏర్పడుతోంది. ఇదే ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత అమిలినేని సురేంద్రబాబుకు కలిసి వచ్చింది. రూ.642 కోట్ల హంద్రీనీవా ఎత్తిపోతల పథకం పనులను దక్కించుకున్న ఆయన.. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పనులు ప్రారంభించారు. ఎర్రమట్టికి డిమాండ్ ఉండడంతో టిప్పర్లతో దారి మళ్లించి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలోనే కళ్యాణదుర్గం టీడీపీ టికెట్ ఖరారు కావడంతో పట్టణంలో సొంత భవంతి నిర్మాణానికి శ్రీకారం చుట్టి.. అక్కడకూ మట్టి తరలించారు. దాదాపు రెండు ఎకరాల్లో పది అడుగుల మేర అక్రమ పునాదులు పరిచారు. ఇందుకోసం వేలాది టిప్పర్ల మట్టి వాడినట్లు తెలుస్తోంది.

మింగింది కొండత..చెల్లించింది గోరంత!

సామాన్యులు ఒక ట్రాక్టరు మట్టి తీసుకెళ్లాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు బడా కాంట్రాక్టరైన అమిలినేని సురేంద్రబాబుకు జీ హుజూర్ అన్నట్లు తెలుస్తోంది. యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోలేదు. అయితే, ఇటీవల హంద్రీనీవా ఉన్నతాధికారుల పరిశీలనలో అక్రమ వ్యవహారం బయటపడడంతో అప్పటికప్పుడు కొంతమేర ప్రభుత్వానికి పన్ను రూపంలో చెల్లించినట్లు తెలిసింది. అయితే, అక్రమంగా తరలించినదానికి, ప్రభుత్వానికి చెల్లించిన మొత్తానికి భారీ స్థాయిలో వ్యత్యాసం ఉన్నట్లు సమాచారం. సంబంధిత డివిజన్ స్థాయి అధికారికి గతంలో భారీగా ముడుపులు ఇవ్వడంతోనే ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూసుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడే ఇలా..గెలిస్తే ఎలానో..?

ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ (ఎస్‌ఆర్‌సీ) సంస్థ ద్వారా అమిలినేని సురేంద్రబాబు చాలా ప్రాంతాల్లో వివిధ పనులు చేస్తుంటారు. ప్రతిచోటా నిబంధనలు ఉల్లంఘించి కొల్లగొట్టిన డబ్బునే ముట్టజెప్పి టికెట్ సంపాదించారనే ఆరోపణలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆయన సాగించిన



లోపల సాగుతున్న పనులు

అక్రమ పర్వాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండడం చూసి మేధావులే కాకుండా సాధారణ ప్రజలు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. తన వద్ద ఉన్న కాసులతో అధికారులను వశపరచుకుని ఇప్పటివరకూ అనధికారికంగా దోపిడీ సాగించిన ఆయన.. ఒక వేళ ఎమ్మెల్యేగా ఎన్నికైతే పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ చర్చించుకుంటున్నారు.

కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేయండి



కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కేంద్రాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై జేసీ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సిద్ధం చేసిన మ్యాపులు పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు పార్కింగ్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌కు సంబంధించి మ్యాపులు సిద్ధం చేయాలన్నారు. తదనుగుణంగా కేంద్రాల్లో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, వి.శ్రీనివాసులురెడ్డి, కరుణకుమారి, వసంతబాబు, రాంభూపాల్‌రెడ్డి, వెన్నెల శ్రీను, డిప్యూటీ కలెక్టర్లు శంకరయ్య, విశ్వనాథ్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, సర్వేయర్ ప్రతాపరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

1,903 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు జిల్లాలో 1,903 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 142 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 31,330 మందికి గాను 32,301 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి కళ్యాణదుర్గంలో మూడు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అలాగే సార్వత్రిక విద్యా పీఠం పరీక్షల్లో భాగంగా ఇంటర్ విద్యార్థులు 1,320 మందికి గాను 1,200 మంది, పదో తరగతి విద్యార్థులు 23 మందికి గాను 22 మంది హాజరయ్యారు.

ఈసీ నిబంధనలు పటిష్టంగా అమలు



సీఈఓ నిర్వహించిన వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిధియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి తదితర అధికారులు

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిధియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్‌ఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, మరమ్మతుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సీ-విజిల్ యాప్‌ను బలోపేతం చేయాలన్నారు. యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. మీడియాలో వచ్చే వ్యతిరేక కథనాలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్ నుంచి అందే ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. అక్కడి నుంచి వెబ్‌కాస్టింగ్ పక్కాగా జరగాలన్నారు. 80 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు, పోలింగ్ కేంద్రానికి రాలేని వారు, మంచానికి పరిమితమైన వారు ఇంటి నుంచి ఓటు వేసే సదుపాయాన్ని కమిషన్ కల్పించిందని, ఇందుకు సంబంధించి టీమ్‌లను ఏర్పాటు చేసి వివరాలను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణి సుస్మిత, రాంభూపాల్‌రెడ్డి, కరుణకుమారి, వసంతబాబు, వెన్నెల శ్రీను, నోడల్ అధికారులు అప్పాజీ, భాస్కర్, ఉమామహేశ్వరమ్మ, శ్రీనివాసనాయక్, ఎస్‌ఐసీ డీఐఓ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు..రగిలిపోతూ

- చంద్రబాబు తీరుపై నిమ్మల, బీకే వర్గాల గుర్రు
- వాడుకుని వదిలేశారంటూ కేడర్ వద్ద ఆవేదన
- కదిరిలో మైనార్టీకి సీటివ్వకుండా మోసం చేశారంటున్న చాంద్‌బాషా వర్గం
- కళ్యాణదుర్గంలో బాబు సొంత సామాజిక వర్గంలోనే అసమ్మతి జ్వాలలు
- అనంతపురం, గుంతకల్లు సీట్లపై అందుకే తాత్సారం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'ఎవరైనా ఒకటే.. వెన్నుపోటే' అంటూ తనకు వెన్నతో పెట్టిన విద్యను చంద్రబాబు ప్రదర్శించారు. బూటకపు హామీలతో అన్ని వర్గాలనూ మోసం చేసిన ఆయన సొంత పార్టీ నేతలనూ వంచించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రేగిన మంటలు చల్లారడం లేదు. 20 రోజుల క్రితం టికెట్లు ప్రకటించినా రోజూ ఏదో ఒక నియోజకవర్గంలో అసమ్మతి సెగలు ఎగుస్తూనే ఉన్నాయి. ఈ పరిణామాలు టికెట్లు దక్కించుకున్న ఆ పార్టీ అభ్యర్థులను కలవరపెడుతున్నాయి.

బీసీ నేతల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం

అనంతపురం జిల్లాలో బీసీ వర్గాలు ఎక్కువగా ఉన్నాయి. అలాంటి వారినే బాబు తొక్కేశారు. చేనేత వర్గానికి చెందిన సీనియర్ నేత, ఎంపీగా, మంత్రిగా సేవలందించిన నిమ్మల కిష్టప్పను వాడుకుని వదిలేశారు. దీంతో నిమ్మల లోలోనే కుమిలిపోతున్నారు. పెనుకొండ నియోజకవర్గానికి చెందిన మరో సీనియర్ నేత బీకే పార్థసారథి వర్గం కూడా అంతే స్థాయిలో అసంతృప్తిగా ఉంది. కురుబ సామాజిక వర్గంలో మంచి పట్టున్న పార్థసారథిని ఈ దఫా చంద్రబాబు విస్మరించారంటూ పార్థ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇక పుట్టపర్తిలో వడ్డెర్లకు టికెట్ ఇస్తామని మోసం చేశారని ఏకంగా చంద్రబాబు ఇంటివద్దే పలువురు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీ వేణుగోపాల్‌ను పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పి చివరకు పల్లె రఘునాథరెడ్డి కోడలికి టికెట్ ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. పల్లె దగ్గర రూ.కోట్లు తీసుకుని టికెట్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు.

మైనార్టీలను ముంచేశారు

చంద్రబాబు తమనూ వంచించారని ముస్లిం మైనార్టీ వర్గం నేతలు వాపోతున్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున కదిరి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత టీడీపీలోకి వెళ్లిన చాంద్‌బాషాకు ఈ దఫా మొండిచేయి చూపారు. నకిలీ డీడీల కేసులో శిక్ష పడిన కందికుంట ప్రసాద్ కుటుంబానికి టికెట్ ఇవ్వడంపై చాంద్ వర్గీయులు మండిపడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క మైనార్టీకి కూడా సీటు ఇవ్వకపోవడంపై రగిలిపోతున్నారు. ఇక అనంతపురం అర్బన్ అసెంబ్లీ టికెట్ జనసేనకు కేటాయించి, బలిజ అభ్యర్థిని రంగంలోకి దింపుతామని ఆశ చూపి, నేడు మళ్లీ తన సామాజికవర్గం వారినే నిలబెట్టే ప్రయత్నం చేస్తుండడంపై ఆయా వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సొంతవారైనా అంతే..

చివరకు సొంత సామాజిక వర్గం నేతలు కూడా బాబును దుమ్మెత్తి పోస్తున్నారు. కళ్యాణదుర్గం టికెట్ కోసం ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వర నాయుడు పోటీ పడ్డారు. చివరకు ఇద్దరిలో ఎవరికి సీటు ఇచ్చినా కలసి పని చేస్తామని ప్రకటించారు. కానీ చంద్రబాబు బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రను తెరమీదకు తెచ్చారు. దీన్ని ఉన్నం, ఉమా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక గుంతకల్లు టికెట్ గుమ్మనూరు జయరాముకు ఇస్తే ఇంతెంత అసమ్మతి మొదలవుతుందోనని ఆ సీటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అనంతపురం అర్బన్ సీటులో కూడా అసమ్మతుల బెడద తప్పించుకునేందుకు ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

హరహర మహాదేవ

- నేత్రపర్వం.. గవిమఠం చంద్రమౌళీశ్వరుడి బ్రహ్మరథోత్సవం
- స్వామి దర్శనంతో పులకించిన భక్తజనం

ఉరవకొండ: హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఉరవకొండ మార్మోగింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 770 ఉపమఠాలు కలిగిన అతిపెద్ద ధార్మిక మఠంగా గుర్తింపు పొందిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది.మఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ ఆధ్వర్యంలో ఉదయం చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించిన అనంతరం రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మూడు ప్రదక్షిణలు చేయించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి ఉత్సవాన్ని ప్రారంభించారు. అశేష భక్తజనం నడుమ రథోత్సవం ఆద్యంతం కనులపండువగా సాగింది. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి రథోత్సవంలో పాల్గొన్నారు. గవిమఠం పీఠాధిపతులు, ఉత్తరాధికారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వై.మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు సురేష్‌బాబు, ప్రవీణ్, ఎస్‌ఐ రాఘవేంద్రప్పలు బందోబస్తు చేపట్టారు.

అశేష భక్తజనం నడుమ సాగుతున్న గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం







ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం, బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



యాగశాలలో కొలువుదీరిన నారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళ వారం అంకురార్పణ చేశారు. మంగళ వాయిద్యాల మధ్య నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపానికి చేరుకున్నారు. అర్చక పండితులు నిర్ణీత ప్రదేశంలో 'భూమిపూజ'తో పుట్టమన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక(కుండ)ల్లో నవ ధాన్యాలతో అంకురార్పణ చేశారు.

నేడు ఖాద్రీశుని కల్యాణోత్సవం

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన శ్రీవారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి 9.30 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఆలయ అధికారులు, అర్చకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ అరుణ్‌బాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇప్పటికే పట్టణానికి నలువైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరిపించేందుకు టీటీడీ తరఫున కొందరు అర్చక పండితులు హాజరు కానున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

క్లుప్తంగా

జొన్న ఇగురు తిని 49 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

బొమ్మనహాళ్‌: జొన్న ఇగురు తిన్న 49 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వివరాలు... బొమ్మనహాళ్‌ మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన లాల్యానాయక్‌ గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గొర్రెల మందను మేపునకు బళ్లారి ప్రాంతానికి తోలుకెళ్లాడు. మంగళవారం తిరిగి స్వగ్రామానికి మందతో చేరుకుంటూ మార్గమధ్యంలో బొమ్మనహాళ్‌ మండలం గంగవరం సమీపంలో బస చేశాడు. అదే సమయంలో అక్కడ దున్నేసిన అపరిపక్వ జొన్న ఇగురు తిన్న 49 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి రమేష్‌ అక్కడకు చేరుకునేలోపు కొన్ని గొర్రెల కళేబరాలను స్థానికులు ఎత్తుకెళ్లారు. గొర్రెల కళేబరాలను పరిశీలించిన అనంతరం డాక్టర్‌ రమేష్‌ మాట్లాడుతూ.. జొన్న ఇగురులోని హైడ్రోజన్‌ సైనేట్‌ అనే పదార్థమే గొర్రెల మృతికి కారణంగా తెలిపారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రాంతీయ పశువైద్య సంచాలకులు డాక్టర్‌ శ్రీనివాస్‌ సంఘటనాస్థలానికి చేరుకుని పూర్తి నివేదిక ఇవ్వాలని పశువైద్యాధికారిని ఆదేశించారు. బాధిత కాపరిని ఎంపీపీ పెద్దన్న, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, కురుబ సంఘం అధ్యక్షుడు దొనస్వామి పరామర్శించారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా డాక్టర్‌ నిరంజన్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్‌: వైఎస్సార్‌సీపీ అనుబంధ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా శింగనమల నియోజకవర్గానికి చెందిన డాక్టర్‌ చుక్కలూరు నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా నిరంజన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

పగబట్టిన జేసీ

- 800 మంది పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్‌: ఓర్వలేని తనం... అసూయ... పేదరికమంటే గిట్టని నైజంతో రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు సాగిస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి పైశాచిక ఆనందానికి తాడిపత్రిలోని ఆంజనేయస్వామి మాన్యం పేదలు బలయ్యారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇంటి పట్టాల కోసం ఎదురు చూస్తున్న 800 కుటుంబాల ఆశలపై నీళ్లు చల్లుతూ ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వస్తున్నారు.

అందరూ నిరుపేదలే...

తాడిపత్రి నడిబొడ్డున ఉన్న సర్వే నంబర్‌ 9లోని 12.67 ఎకరాల భూమి ఆంజనేయస్వామి మాన్యం కింద ఉంది. వివిధ ప్రాంతాల నుంచి తాడిపత్రిలో స్థిరపడిన నిరుపేదలు 1995 నుంచి ఈ భూమిలో గుడిసెలు, బండల మిద్దెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గ్రానైట్‌, నల్లబండలు తదితర పరిశ్రమల్లో కూలీలుగా పనిచేస్తున్న వీరంతా కనీస అద్దె కూడా చెల్లించలేని స్థితిలో మాన్యం భూమిలో తల దాచుకుంటున్నారు. ఈ క్రమంలో తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించాలంటూ పలుమార్లు జేసీ ప్రభాకరరెడ్డితో పాటు అధికారుల చుట్టూ తిరిగారు. ప్రాధేయపడ్డారు. అయినా ఫలితం దక్కలేదు. జేసీని కలిసిన ప్రతిసారీ బండ బూతులతో విరుచుకుపడేవారు. అయినా మౌనంగానే భరిస్తూ... ఉద్యమ బాట పట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. మాన్యం భూమికి సమానమైన మార్కెట్‌ ధర ఉన్న భూమిని ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ సిద్ధం కావడంతో దేవదాయశాఖ అధికారులు సమ్మతించారు.

అధికారులను బ్లాక్‌మెయిల్‌ చేసి...

తన ప్రమేయం లేకుండా పేదలు పట్టాలు తెచ్చుకుంటున్నారన్న విషయం తెలియగానే జేసీ ప్రభాకరరెడ్డి రగిలిపోయారు. వెంటనే అధికారులను బ్లాక్‌మెయిల్‌ చేస్తూ బూతులతో విరుచుకుపడ్డారు. నందలపాడు సమీపంలోని బుగ్గ వంక వద్ద సర్వే నంబర్‌ 57 నుంచి 60 వరకు ఉన్న భూమితో పాటు తాడిపత్రి మండలం ఆలూరు వద్ద అదనంగా మరో రెండు ఎకరాలు దేవదాయశాఖ పరం చేసేందుకు రెవెన్యూ అధికారులు చేపట్టిన చర్యలను అడ్డుకున్నారు. బుగ్గ వంక వద్ద ఉన్న భూమిలో బండరాళ్లు, వ్యర్థాలు ఉన్నాయని, ఆ భూమి తమకు వద్దంటూ దేవదాయ శాఖ అధికారులతో చెప్పించారు. విషయం తెలుసుకున్న పేదలు చందాలు వేసుకుని జేసీబీ సాయంతో ఆ స్థలాన్ని శుభ్రం చేయించినా ఫలితం లేకపోయింది.



జేసీ ప్రభాకరరెడ్డి వైఖరితో పట్టాలకు నోచుకోని కాలనీ

ఎన్నో ఏళ్లుగా ఇక్కడే..



ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఎలాంటి సదుపాయాలు లేవు. మాకు పట్టాలు ఇప్పించాలని మున్సిపల్‌ చైర్మన్‌ను కోరినా పట్టించుకోలేదు. అధికారులు ముందుకు వచ్చినా పడనివ్వడం లేదు. బండల పాలీసు పనితో జీవనం సాగిస్తున్నాం.

– పెద్దక్క, తాడిపత్రి

పట్టాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు



వైఎస్సార్‌ జిల్లా పైడిపాలెం నుంచి ఉపాధి కోసం 30 ఏళ్ల క్రితం ఇక్కడకు వలస వచ్చి స్థిరపడ్డాం. పట్టాల కోసం ఆందోళనలు చేసినా పట్టించుకోవడం లేదు. కావాలనే పట్టాలు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారు. మరుగుదొడ్లు లేక బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోంది.

– వన్నూరమ్మ, తాడిపత్రి

ఎమ్మెల్యే పెద్దారెడ్డి చర్యలను అడ్డుకుని

గత ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి హామీనిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు శాఖల అధికారులను సమన్వయపరిచి పట్టాల పంపిణీకి సిద్ధమవుతున్న తరుణంలో జేసీ ప్రభాకరరెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపారు. ఆలయంలో తాత్కాలిక అర్చకులుగా పనిచేస్తున్న వారితో హైకోర్టులో పిల్‌ వేయించి అడ్డుకున్నారు. జేసీ నిర్వాకంతో పట్టాల పంపిణీ నిలిచిపోయింది.

జగనన్న మళ్లీ సీఎం కావాలి

- శ్రీకాకుళం జిల్లా నివాసి సన్యాసిరావు



సన్యాసిరావును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, పార్టీ శ్రేణులు

రాయదుర్గంటౌన్‌: ఏపీకి మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డే సీఎం కావాలని, ఆ దిశగా ఎన్నికల్లో ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేయాలంటూ శ్రీకాకుళం జిల్లా అంపోలు గ్రామానికి చెందిన జి.సన్యాసిరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ గెలుపును ఆకాంక్షిస్తూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని ప్రజలను చైతన్యపరిచేలా సన్యాసిరావు చేపట్టిన బైక్‌ యాత్ర మంగళవారం రాయదుర్గం పట్టణానికి చేరుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిని కలసి తన యాత్రలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. సీఎం వైఎస్‌ జగన్‌ సంక్షేమ పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. దేశ చరిత్రలో పేదలకు మేలు చేస్తున్న ఏకైక నాయకుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రంలో పేదరికం మటుమాయం అవుతుందని అన్నారు. ఈ అంశంపై ప్రజలను చైతన్య పరుస్తూ తాను చేపట్టిన బైక్‌ యాత్ర ఇప్పటికే 65 నియోజకవర్గాల్లో 1,700 కిలోమీటర్ల మేర సాగిందని వివరించారు.

జిల్లా విద్యాశాఖ తీరుపై డీఆర్వో ఆగ్రహం

అనంతపురం అర్బన్‌: ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చే విషయంలో విద్యాశాఖ అనుసరించిన వైఖరి వివాదాస్పదంగా మారింది. ఆ శాఖ అధికారుల తీరుపై డీఆర్వో రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మ్యాన్‌పవర్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ చేపట్టిన విచారణకు దరఖాస్తు చేసుకున్న వారితో పాటు దరఖాస్తు చేసుకోనివారు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మినహాయింపు కోసం 355 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు కలెక్టరేట్‌కు తొలుత జాబితా పంపించారు. విచారణ రోజు బుధవారం ఏకంగా 500 మందితో కూడిన జాబితాను అందజేశారు. అలాగే మినహాయింపునకు దరఖాస్తు చేసుకోని ఉపాధ్యాయులు దాదాపు 300 మంది హాజరయ్యారు. దీంతో విచారణ ప్రక్రియ గందరగోళంగా మారింది. పరిస్థితి తెలుసుకున్న డీఆర్వో జి.రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని తెలుసుకుని విద్యాశాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలో స్పష్టత లేకపోతే ఎలాగంటూ అసహనం వ్యక్తం చేశారు. విచారణకు విద్యాశాఖ నుంచి అధికారులెవరూ హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. విచారణ ప్రక్రియను ఐదు రోజులు నిర్వహించాలని ఆదేశించారు. రోజుకు 100 మందిని మాత్రమే విచారణ చేయాలన్నారు. విచారణకు హాజరవ్వాలని ఆ వందమందికి ఒక రోజు ముందే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులకు సంబంధించి విచారణ జరుగుతున్నందున జిల్లా విద్యాశాఖ అధికారి తప్పనిసరిగా హాజరవ్వాలని ఆదేశించారు.



విచారణ నిర్వహిస్తున్న మ్యాన్‌పవర్‌ కమిటీ సభ్యులు

సూక్ష్మ సాయం..మనమే ఘనం!

- డ్రిప్‌, స్ప్రింక్లర్‌ యూనిట్ల మంజూరులో అగ్రస్థానంలో 'అనంత'
- 6,534 మంది, 7,627 హెక్టార్లతో 'శ్రీ సత్యసాయి'కి ఐదో స్థానం
- ఉమ్మడి జిల్లాలో రైతులకు రూ.146 కోట్లకు పైగా రాయితీ



డ్రిప్‌ ద్వారా టమాట సాగు

అనంతపురం అగ్రికల్చర్‌: బిందు, తుంపర (డ్రిప్‌, స్ప్రింక్లర్లు) యూనిట్ల మంజూరులో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత 2023–24 ఏడాది 12,500 హెక్టార్లకు ఇవ్వాలని టార్గెట్‌ పెట్టుకోగా... 10,088 మంది రైతులకు 12,375 హెక్టార్లకు ఇచ్చారు. పరికరాలు మంజూరు, ఇన్‌స్టాలేషన్‌లో 26 జిల్లాల కన్నా 'అనంత' మొదటి స్థానంలో నిలిచింది. మన జిల్లా తర్వాత వైఎస్సార్‌ జిల్లా 10,573 హెక్టార్లు, ప్రకాశం– 9,714 హెక్టార్లు, అన్నమయ్య–7,683 హెక్టార్లకు మంజూరు చేశాయి. ఇక శ్రీ సత్యసాయి జిల్లా 6,534 మంది రైతులు, 7,627 హెక్టార్లతో ఐదో స్థానంలో నిలిచింది.

రూ.146 కోట్లకు పైగా రాయితీ..

ఎన్నికల కోడ్‌ వెలువడక మునుపే నిర్దేశిత లక్ష్యాన్ని ఏపీఎంఐపీ పూర్తి చేయడంతో రైతులకు ఇబ్బంది లేకుండా పోయింది. ఐదు ఎకరాల్లోపు చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఆ పైన భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్‌ యూనిట్లు ఇస్తున్నారు. ఇక స్ప్రింక్లర్‌ సెట్లు ఐదు ఎకరాల్లోపున్న రైతులకు 55 శాతం రాయితీ, ఆ పైన 12.50 ఎకరాలున్న రైతులకు 45 శాతం రాయితీ వర్తింపజేయడంతో ఊరట దక్కుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 90 శాతం డ్రిప్‌ మంజూరు చేయగా, కేవలం 10 శాతం మాత్రమే స్ప్రింక్లర్‌ యూనిట్లు ఇచ్చారు. ఎస్సీ ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే మిగతా అన్ని వర్గాలకు సీనియార్టీ వారీగా సకాలంలో పరికరాలు మంజూరు చేశారు. అనంతపురం జిల్లాలో రూ.118 కోట్లకు పైగా విలువ చేసే పరికరాలు ఇవ్వగా శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.61 కోట్లు విలువ చేసే డ్రిప్‌, స్ప్రింక్లర్లు అందించారు. ఇందులో అనంతపురం జిల్లాలో 10,088 మంది రైతులకు రూ.97 కోట్లకు పైగా రాయితీ వర్తించగా, శ్రీ సత్యసాయి జిల్లాలో 6,534 మంది రైతులకు రూ.49 కోట్లకు పైగా రాయితీ వర్తింపజేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సూక్ష్మసాగు సేద్య పరికరాలపై ఏకంగా రూ.146 కోట్లకు పైగా రాయితీ వర్తించడం విశేషం. మంజూరు చేసిన రైతులందరి పొలాల్లో త్వరితగతిన పరికరాలు బిగించేలా చర్యలు చేపట్టినట్లు ఏపీఎంఐపీ రెండు జిల్లాల అధికారులు రఘునాథరెడ్డి, సుదర్శన్‌, ఫిరోజ్‌ఖాన్‌ తెలిపారు.

యువకుడి దుర్మరణం



మృతుడు పవన్‌కుమార్‌

కూడేరు: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన వడ్డే పవన్‌కుమార్‌ (26)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్న పవన్‌కుమార్‌... మంగళవారం ఉరవకొండలో జరుగుతున్న గవిమఠం రథోత్సవంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉదిరిపికొండ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో వడ్డే పవన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, అనంతపురంలోని సర్వజనాస్పత్రి మార్చురీలో ఉంచిన పవన్‌కుమార్‌ మృతదేహాన్ని ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ బైరెడ్డి రామచంద్రారెడ్డి, ట్రేడ్‌ యూనియన్‌ జిల్లా సహాయ కార్యదర్శి మంజునాథరెడ్డి, కూడేరు సొసైటీ అధ్యక్షుడు గంగాధర్‌ పరిశీలించి, నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ సీజ్‌

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు వద్ద పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3 ట్రాక్టర్లు, ఓ టిప్పరు, జేసీబీని సీజ్‌ చేసినట్లు యాడికి సీఐ రోషన్‌ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి వాహనాలు సీజ్‌ చేసినట్లు వివరించారు. ఇందుకు సంబంధించి పది మందిపై కేసు నమోదు చేశామన్నారు.

భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

కళ్యాణదుర్గం: తన భర్త వేధిస్తున్నాడంటూ పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేసింది. వివరాలు... బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన జయమ్మకు 12 ఏళ్ల క్రితం శెట్టూరు మండలం ఐదుకల్లుకు చెందిన రామకృష్ణతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇటీవల రామకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న జయమ్మ తన భర్తను నిలదీసింది. దీంతో కక్ష పెంచుకున్న ఆయన తరచూ జయమ్మను చిత్ర హింసలకు గురి చేస్తూ వచ్చాడు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మంగళవారం తన భర్త నుంచి తనను, పిల్లల్ని కాపాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది.

జాతీయస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు ఎస్కేయూ మహిళల జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ వీసీ డాక్టర్‌ హుస్సేన్‌రెడ్డి, తదితరులు

అనంతపురం: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ చెన్నైలోని అన్నా యూనివర్సిటీ వేదికగా జరిగే జాతీయ స్థాయి ఇంటర్‌ యూనివర్సిటీ మహిళల బాల్‌ బ్యాడ్మింటన్‌ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో అనంతపురంలోని ఆర్ట్స్‌ కళాశాలకు చెందిన హెచ్‌.గంగోత్రి, ఎ.స్నేహ, కె.అంకిత, కేఎస్‌ఎన్‌ ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన వి.నిఖిల, డి.ఐశ్వర్య, ఎస్‌ఎస్‌బీఎన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.నవ్యశ్రీ, ఎస్వీ డిగ్రీ కళాశాలకు చెందిన జె.గిరిచైత్ర, ఎస్కేయూ క్యాంపస్‌ ఇంజినీరింగ్‌ కళాశాల విద్యార్థిని బి.ఇంద్ర, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వై.శివాని, హిందూపురంలోని ఎస్‌ఎస్‌పీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సీపీవీ సాయిప్రియ ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎస్కేయూ వీసీ డాక్టర్‌ కె.హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్‌ ఎంవీ లక్ష్మయ్య, స్పోర్ట్స్‌ సెక్రటరీ డాక్టర్‌ ఎంవీ శ్రీనివాసన్‌ అభినందించారు.

పుష్ప విమానంలో దర్శనమిచ్చిన చెన్నకేశవుడు



పుష్ప విమానంలో విహరిస్తున్న శివలక్ష్మి చెన్నకేశవస్వామి

యాడికి: మండల కేంద్రంలో వెలసిన శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం చెన్నకేశవుడు పుష్ప విమానంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి 10గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను పుష్ప విమానంలో అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ నాగార్జున రెడ్డి, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ బొంబాయి రమేష్‌ నాయుడు, ఉప సర్పంచ్‌ కాసా చంద్రమోహన్‌, వార్డు సభ్యుడు తిరుపతి, రామచంద్ర, బాల పెద్దయ్య, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటనాయుడు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌ నాటకం!

- మిస్టరీ ఛేదించిన పోలీసులు



బాలుడు కిడ్నాప్‌ అయ్యాడన్న ప్రాంతంలో విచారణ చేస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మంగళవారం ఉదయం బాలుడి కిడ్నాప్‌ ఉదంతం కలకలం రేపింది. అయితే తనను కిడ్నాప్‌ చేశారంటూ బాలుడు కట్టుకథ అల్లినట్లుగా పోలీసులు నిగ్గు తేల్చారు. వివరాలు... పెద్దవడుగూరులో నివాసముంటున్న ఓబుళరాజు, మాధవి దంపతుల కుమారుడు మహేష్‌ స్థానిక సరస్వతి హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. పెన్సిల్‌ తెచ్చుకుంటానని మంగళవారం ఉదయం 8 గంటలకు దుకాణానికి వెళ్లిన బాలుడు ఎంత సేపటికీ ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురై బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఉదయం 1030 గంటలకు ఇంటికి చేరుకున్న మహేష్‌... తల్లిదండ్రుల నిలదీయడంతో తనను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్‌ చేశారంటూ తెలిపాడు. తల్లిదండ్రుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసుల వెంటనే రంగంలో దిగారు. కిడ్నాప్‌ జరిగిన తీరును బాలుడిని అడిగి తెలుసుకున్నారు. తనను ఇద్దరు వ్యక్తులు నాగి షాపు వద్ద బైకుపై ఎక్కించుకుని చిన్నవడుగూరు రోడ్డులోని బైకు రిపేరీ షాపు వద్దకెళ్లారని, తిరిగి అక్కడి నుంచి గంగమ్మ గుడి దేవాలయం సందులో తీసుకెళ్లి మిడుతూరుకు చేరుకున్నారన్నారని తెలిపాడు. అక్కడ తనకు వాంతి వస్తుందని చెప్పడంతో బైక్‌ నుంచి కిందకు దింపారన్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఓ వృద్ధుడు గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా బాలుడు ఒక్కడే నడుచుకుంటూ వెళుతుండడం గమనించారు. దీంతో బాలుడు కట్టుకథ అల్లినట్లుగా నిర్ధారించుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



విజయ్‌ (ఫైల్‌)

తాడిమర్రి: పదో తరగతి విద్యార్థి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్సింపల్లికి చెందిన గోగుల గంగాధర, కుమారి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు విజయ్‌ (15) బత్తలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. తొలిరోజు తెలుగు పరీక్ష రాశాడు. రెండో రోజు మంగళవారం హిందీ పరీక్ష రాయాల్సి ఉంది. అయితే తనకు హిందీ సరిగా రాదని పరీక్షకు వెళ్లకుండా ఆగిపోయాడు. వచ్చిన మేరకు రాసిరావాలని తండ్రి చెప్పాడు. అనంతరం తల్లిదండ్రులు పనిపై బయటకు వెళ్లిన సమయంలో బాత్‌రూంలోని కిటికీకి విజయ్‌ చీరతో ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న గంగాధర బాత్‌రూంలోకి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించి సాయంత్రం నాలుగు గంటల సమయంలో విజయ్‌ మృతి చెందాడు. ఎస్‌ఐ నాగస్వామి కేసు నమోదు చేశారు.

ఏసీబీ వలలో మడకశిర సబ్‌ రిజిస్ట్రార్‌

- లంచం తీసుకుంటూ పట్టుబడిన దామోదర్‌



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్‌ రిజిస్ట్రార్‌ దామోదర్‌, డాక్యుమెంట్‌ రైటర్‌ షమీవుల్లా

మడకశిర: శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్‌ రిజిస్ట్రార్‌ దామోదర్‌ అలియాస్‌ దామోదర్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. అసైన్డ్‌ భూమి రిజిస్ట్రేషన్‌ కోసం రూ.2.50 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. మడకశిర మండలం గంతలపల్లికి చెందిన రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి హనుమంతరెడ్డి 6.36 ఎకరాల అసైన్డ్‌ భూమిని రిజిస్టర్‌ చేయించుకోవడానికి కొన్ని రోజుల క్రితం సబ్‌ రిజిస్ట్రారు దామోదర్‌ను సంప్రదించాడు. ఇందుకు సబ్‌ రిజిస్ట్రార్‌ భారీమొత్తంలో డబ్బు డిమాండ్‌ చేశారు. దీంతో అతను డాక్యుమెంటు రైటర్‌ షమీవుల్లా ద్వారా సంప్రదింపులు జరిపి రూ.2.50 లక్షలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ ఈ మొత్తమూ చెల్లించడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు వల పన్ని పట్టుకోవడానికి పథకం రూపొందించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో బాధితుడు రూ.2.50 లక్షల నగదు డాక్యుమెంట్‌ రైటర్‌ చేతికి ఇచ్చాడు. అతను తీసుకెళ్లి సబ్‌ రిజిస్ట్రారుకు అందజేస్తుండగా..ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. సబ్‌ రిజిస్ట్రార్‌తో పాటు డాక్యుమెంటు రైటర్‌ను అరెస్ట్‌ చేశారు.అలాగే రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. నిందితులను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

పన్ను బకాయిదారులకు తీపి కబురు

- ఈ ఏడాది ఇంటి, ఖాళీ జాగా పన్ను చెల్లింపులపై వడ్డీ మాఫీ
- పన్ను వసూళ్లకు ప్రత్యేక బృందాలు
- ఇప్పటి వరకు రూ.2.36 కోట్లు వసూలు





అసెస్‌మెంట్‌దారుని నుంచి రూ.3 లక్షలు పన్ను మొత్తాన్ని, చెక్కు రూపంలో తీసుకుంటున్న ఆర్‌ఓ సతీష్

అనంతపురం కార్పొరేషన్: పన్ను బకాయిదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతేడాది తరహాలోనే ఈ ఏడాది వడ్డీ లేకుండా పన్ను చెల్లించే సదుపాయాన్ని ప్రజలకు అందించింది. మార్చి నెలాఖరు వరకు ఇంటి పన్నును ఒకేసారి చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన పనిలేదు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు పన్ను చెల్లింపులపై ప్రత్యేక దృష్టిసారించారు.

ఇంటి పన్ను రూ.31.87 కోట్లు:
నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో మొత్తం 58,238 హౌస్ హోల్డ్స్ ఉన్నాయి. 952 ఖాళీ స్థలాలకు అసెస్‌మెంట్లున్నాయి. మొత్తం 59,211 అసెస్‌మెంట్లకు గానూ రూ.31.87 కోట్ల మేర పన్ను వసూలు చేయాల్సి ఉంది. అందులో ఇంటి పన్ను అరియర్స్ రూ.12.2 కోట్లు, డిమాండ్ రూ.14.67 కోట్లు. ఖాళీ జాగా పన్ను రూ.4.40కోట్లు వసూలు చేయాలి. అందులో అరియర్స్ రూ.2.85 కోట్లు, కరెంట్ రూ.1.55 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఈ నెల 1 నుంచి ప్రభుత్వం ఇంటి, ఖాళీ జాగా పన్ను వసూళ్లకు వడ్డీ మాఫీ ఇవ్వడంతో ఈ నెల 17 వరకు రూ.2.36 కోట్లు(రెండు కోట్ల 36 లక్షలు) అసెస్‌మెంట్‌దారులు పన్ను చెల్లించారు. నగరంలోని సుభాష్ రోడ్డు, కమలానగర్, రాంనగర్, గుల్జార్‌పేట, తదితర ప్రాంతాల్లో 40 మంది మొండి బకాయిదారులు కొన్నేళ్లుగా రూ.6 కోట్ల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పర్యవేక్షణలో రెవెన్యూ ఆఫీసర్లు సుజాత, సతీష్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలతో పాటు సచివాలయ సిబ్బంది పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. పన్ను చెల్లించని వారికి సచివాలయ సిబ్బంది నోటీసులు జారీ చేస్తున్నారు.

50	మొత్తం డివిజన్లు
74	సచివాలయాలు
59, 211	అసెస్‌మెంట్లు మొత్తం
రూ.36.87 కోట్లు	ఇంటి పన్ను మొత్తం
రూ.4.40 కోట్లు	ఖాళీ జాగా పన్ను మొత్తం

అవకాశాన్ని వినియోగించుకోండి

వడ్డీ లేకుండా ఇంటి పన్ను కట్టేందుకు మంచి అవకాశం వచ్చింది. ఏళ్ల తరబడి ఇంటి పన్ను కట్టని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. సాధ్యమైనంత త్వరగా పన్ను చెల్లించాలి.



\- మేఘ స్వరూప్, కమిషనర్, నగరపాలక సంస్థ

'అనంతను మరోసారి గెలిపించుకుందాం'



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

అనంతపురం కల్చరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని పలువురు ముస్లిం మతపెద్దలన్నారు. మంగళవారం నగరంలోని మస్జిద్–ఏ–మొహిద్దీన్ అష్రఫియాలో ముతవల్లి సిరాజుద్దీన్ ప్రత్యేక దువా నిర్వహించి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన అనంత వెంకటరామిరెడ్డిని అభినందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మసీదులో ఈనెల 28న పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యేకి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, మతపెద్దలతో పాటూ మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ పాల్గొన్నారు.

మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించండి

రాప్తాడు: సీఎం వైఎస్ జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్‌తో కలిసి గొల్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఇచ్చిన ప్రతి హామీని జగనన్న అమలు చేశారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, సర్పంచు హన్మంత్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, రామచంద్రా రెడ్డి, సాకే చంద్ర, జయన్న, తిరుపాల్ రెడ్డి, డోక్కా రామచంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, క్రిష్ణమూర్తి, డీలర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కలెక్టరేట్ పోలీస్ అవుట్‌పోస్టులో అసౌకర్యాలు



కలెక్టరేట్‌లోని పోలీస్ అవుట్‌పోస్టు



పగిలిపోయిన బండలు

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయానికి నిరంతరం భద్రత కల్పించే పోలీస్ అవుట్‌పోస్టులో అసౌకర్యాలు తిష్టవేశాయి. బండలు పగిలి కొంత భాగం కుంగింది. బండల సందుల నుంచి విష కీటకాలు గదిలోకి వచ్చి చొరబడుతున్నాయి. దీంతో పోలీసు సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. అవుట్ పోస్టుకు నీటి సరఫరా నిలిచిపోయింది. కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను మరమ్మతు చేయిస్తున్న అధికారులు దుస్థితిలో ఉన్న అవుట్ పోస్టును పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఒంటెద్దు రామలింగారెడ్డికి ఉగాది పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన పద్యకవి ఒంటెద్దు రామలింగారెడ్డి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. గుంటూరు అమరావతి సాహితీ సంస్థ తరఫున డాక్టర్ రావిరంగారావు, పింగళి భాగ్యలక్ష్మి రాష్ట్రంలోని పలువురు కవులకు ఉగాది పురస్కారాల వివలరాను వెల్లడించారు. వచ్చేనెల 7న గుంటూరులో జరిగే పురస్కార ప్రదానోత్సవంలో ఒంటెద్దు రామలింగారెడ్డి ప్రజాప్రతినిధులు, సుప్రసిద్ధ కవుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటారు. పురస్కారానికి ఎంపికైన కవి రామలింగారెడ్డిని అనంత కవులు నరసిరెడ్డి, రియాజుద్దీన్ అభినందించారు.

పౌష్టికాహారంతో చిన్నారుల్లో ఎదుగుదల



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగరత్న

రాప్తాడు: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వడం వల్ల చిన్నారుల్లో మంచి ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత అన్నారు. రాప్తాడు, బొమ్మేపర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహార పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ పోషణ కింద అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది, పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యకర్తలు భారతి, వాణి, ముత్యాలమ్మ, మణిమాల పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో పేకాటాడుతున్న ఏడుగురిని అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం పట్టణంలోని వాటర్‌వర్క్స్ రోడ్డులోని ఖాళీ ప్రదేశంలో పేకాటాడుతున్న సమాచారం అందుకున్న సీఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న శశిధర్‌రెడ్డి, మహబుబ్‌బాషా, రవినాథ్‌రెడ్డి, నాగరాజు, రామసుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రూ.45,760 నగదును స్వాధీనం చేసుకునట్లు సీఐ తెలిపారు.

నేడు 28వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 28వ డివిజన్‌లో బుధవారం ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం జరగనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అశోక్‌నగర్ 2వ క్రాస్ నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, తదితరులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

'నా మొదటి ఓటు దేశం కోసం'



ప్రజలకు ఓటు హక్కు గురించి వివరిస్తున్న సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ' నా మొదటి ఓటు దేశం కోసం' అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌరులకు ఓటు హక్కు, బాధ్యత గురించి అవగాహన కల్పించడానికి సిండికేట్ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ఎస్ వలంటీర్లు బిషాల్, మధు, సృజన, సంభవ్, ఆశీర్వాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాతార్యారూఢస్వామి తిరునాల

- రేపు పుష్ప రథోత్సవం
- 22న పరుష

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో బుధవారం తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాతార్యారూఢస్వామి జీవ సమాధి కావడంతో ఏటా ఫాల్గుణ మాసం శుద్ధ ద్వాదశి రోజున గ్రామస్తుల ఆధ్వర్యంలో తిరునాల నిర్వ హించడం ఆనవాయితీ అన్నారు. ఇందులో భాగంగా మొదటి స్వామికి ధ్వజారోహ ణం , మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. గురువారం గంగపూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వా మి పుష్ప రథోత్సవం ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

నేత్రపర్వంగా దత్తాత్రేయ నగరోత్సవం





నగరవీధుల్లో సాగుతున్న పల్లకీ సేవ , బాలస్వామి నేతృత్వంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్: దత్త మందిరంలో శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో షోడశ దత్తక్షేత్రం 36వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మ కలశాభిషేకం, దేవతా మూర్తుల మహా సంప్రోక్షణ, వివిధ హోమాలు నిర్వహించారు. దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్తవిజయానందతీర్థస్వామీజీ భగవద్గీత విశిష్టతపై ప్రసంగించారు. సాయంత్రం పాతూరులో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని అప్పా సుధీర్ నేతృత్వంలో బాలస్వామి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరవీధుల్లో శ్రీ అనఘాదేవి సమేత శ్రీ జ్ఞానసాగర దత్తాత్రేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కోడ్ అమలు ఇలాగేనా?

ఆత్మకూరు: ఎన్నికల కోడ్ అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని, శిలాఫలకాలకు ముసుగులు వేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కానీ మండలంలో కొంత మంది అధికారులు మాత్రం కోడ్ నిబంధనలను గాలికి వదిలేశారు. టీడీపీకి సంబంధించి చాలా గ్రామాల్లో శిలాఫలకాలను వదిలేశారు. పీ యాలేరు బీసీ కాలనీలో టీడీపీ హయాంలో వేసిన శిలాఫలకాలకు ముసుగులు వేయకుండా వదిలేశారు. గొరిదిండ్లలో శిలాఫలకానికి ముసుగు వేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు మాత్రం అధికారులు ముసుగులు వేయించారు. ఆత్మకూరులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఫొటోలతో ఉన్న పోస్టర్లను అధికారులు తొలగించారు. అధికారులు స్పందించి కోడ్ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పి. యాలేరులోని బీసీ కాలనీలో టీడీపీ హయాంలో వేసిన శిలాఫలకానికి ముసుగు వేయని దృశ్యం

కళాశాలలో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. పాతకాలపు పద్ధతులను గుర్తు చేస్తూ నోరూరించే వంటకాలు ప్రదర్శనలో ఉంచారు. ప్రిన్సిపాల్ పి.శంకరయ్య ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకురాలు ఫాతిమున్నీసా, సునీత, తెలుగు అధ్యాపకుడు రామకృష్ణ, అర్థశాస్త్రం అధ్యాపకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వివిధ వంటలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాలు.. జక్కలచెరువు గ్రామానికి చెందిన యువకులు సురేష్, సంజీవ కారులో గుత్తి పట్టణానికి బయలుదేరారు. గ్రామ శివారులో జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న సురేష్, సంజీవ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని బాలుడికి ...

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లిలో మంగళవారం కారు ఢీకొని మోక్షస్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. శివయ్య కుమారుడు మోక్షస్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చి కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మోక్షస్‌ని వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి కుడి కాలు విరగడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

సొంతింటికి సర్వహక్కులు



ఇంటా పట్టాలను పంపిణీ చేస్తున్న మేయర్ వసీం(ఫైల్)

- ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ వేగవంతం
- ప్రభుత్వ చర్యలపై లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే కాకుండా..ఆ స్థలంపై సర్వహక్కులు కల్పించేలా చర్యలకు ఉపక్రమించింది. పైసా ఖర్చు లేకుండా ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హర్షాతిరేకాలు వెలువడుతున్నాయి.

12వేలకుపైగా రిజిస్ట్రేషన్లు
నగరంలోని 50 డివిజన్ల పరిధిలోని 74 సచివాలయాల్లో 29,583 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి కొడిమి, కురుగుంట ఏ, బీ, సీ, డీ పండమేరు, రాచానపల్లి, సిద్ధరాంపురం ఏ, బీ, సీ, డీ తాటిచెర్ల పాడర్ల, ఉప్పరపల్లి ఏ, సీ, డీ, కామారుపల్లి మొత్తం 18 లేఅవుట్లలో ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించింది. కాగా 14,210 మందికి మ్యాపింగ్ చేసి 11,978 స్థలాలకు బౌండరీలను ఫిక్స్ చేశారు. గత నెల ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం ప్రత్యేక చొరవ, కమిషనర్ మేఘస్వరూప్ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవతం చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 15 వరకు 12,855 రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా, 10063 మందికి రిజిస్ట్రేషన్ ప్రతిని అందజేసినట్లు తెలిపారు.

అధికారులు, సిబ్బంది కృషి:
కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఏసీ శ్రీహరిబాబు పర్యవేక్షణలో నోడల్ అధికారులు, సచివాలయ సిబ్బంది గత నెల రోజులుగా ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌పై కసరత్తు చేశారు. లబ్ధిదారులకు ఫోన్లు చేసి మరీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

40 ఏళ్ల తర్వాత నిలువ నీడ దక్కింది



అనంతపురంలో 40 ఏళ్లుగా ఉంటున్నాం. కానీ ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇళ్లు ఇస్తామని చెప్పలేదు. సీఎం జగన్ సార్ ప్రభుత్వంలో మాకు ఇంటి స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. కొడిమిలో మాకు కేటాయించిన స్థలంలో ఇళ్లు ఏర్పాటైయ్యాక అక్కడే ఉంటాం. మాలాంటి వారి కోసం ప్రభుత్వం చేసిన సేవలను ఎప్పటికీ మరువలేం. నా బిడ్డకు వికలాంగుల పింఛన్, మనవరాలికి అమ్మ ఒడి వస్తోంది.

\- అస్మత్, లబ్ధిదారు

ప్రభుత్వ మేలు మరువలేం

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోపే కొడిమిలో ఇంటి స్థలం వచ్చింది. ఇంత త్వరగా ఇంటి స్థలం ఇస్తారని అనుకోలేదు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాం. సొంతిళ్లు ఉంటే అద్దె ఇంటితో అవసరమే ఉండదు. సంతోషంగా అందులో జీవిస్తాం. ఇళ్లు ఇవ్వడమే కాకుండా స్థలంపై సర్వహక్కులు ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ మేలును మరువలేం. థ్యాంక్యూ సీఎం జగనన్న.

\- శ్యామల దేవి, గృహిణి

స్వీయ రక్షణపై మహిళలకు శిక్షణ

అనంతపురం: మహిళలకు స్వీయ రక్షణపై అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రామమూర్తి అన్నారు. తైక్వాండో నాలుగో డాన్ బ్లాక్ బెల్ట్ గ్రహీత శాంతా రాజ్ మహిళలకు ప్రత్యేక శిక్షణ కల్పించారు. ఆపద సమయంలో తమను తాము కాపాడుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ దోహదపడతాయన్నారు. కళాశాల చైర్మన్ అనంత రాముడు, షీ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ టి. మాధవి, డాక్టర్ ఎంఎస్‌జీ స్మిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాలకు ఆరుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఆరుమంది విద్యార్థులు ఆల్‌సెక్ టెక్నాలజీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో బెంగళూరుకు చెందిన సవ్యసాయ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జాబ్‌మేళా నిర్వహించి రాత, మౌఖిక పరీక్ష నిర్వహించింది. ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి కె.జగదీష్‌కు ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

కష్టపడితే విజయం తథ్యం



ముఖ్య అతిథి శిశిర్ పర్మెని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: జీవితంలో ఎదురయ్యే ఒడుదుడుకులను తట్టుకున్నపుడే గమ్యస్థానం చేరుకోవచ్చని ఈఎస్ఈ కెరియర్ ఆపర్చునిటీ ప్రోగ్రాం ఆఫీసర్ శిశిర్ పర్మె పేర్కొన్నారు. హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ కళాశాలలో ఉద్యోగ అవకాశాలపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉత్తమ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఉద్యోగాలు సాధించలేని విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, కంట్రోలర్ ఎగ్జామినేషన్ శ్రావణి, ఏఓ శివారెడ్డి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

కనగానపల్లి: కనగానపల్లిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ రమాదేవి తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షా కేంద్రం వద్దకు బయట వ్యక్తులు రాకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ అరుణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు 33 మంది గైర్హాజరు
ఆత్మకూరు: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు మంగళవారం 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రామాంజినేయులు తెలియజేశారు. మొత్తం 614 మంది దరఖాస్తు చేసుకోగా 581 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తహసీల్దార్ పరమేశ్వర స్వామి తెలియజేశారు.

నిర్భయంగా ఓటు వేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఆత్మకూరు: అర్హులందరూ నిర్భయంగా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని వీఆర్వోలు బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు తహసీల్దార్ పరమేశ్వర సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. గ్రామాల్లో సమస్యాత్మకంగా ఉంటే పోలీసులకు, అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఎంపీడీఓ దశరథరామయ్య, సీఐ నరేంద్రరెడ్డి, ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి, ఏఓ సుచరిత, ఎంఈఓ రామాంజినేయులు పాల్గొన్నారు.

వంద శాతం వేతనం అమలు చేయాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లందరికీ 100 శాతం గ్రాస్ వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఎన్‌హెచ్‌ఎంలో విధులు నిర్వర్తించే ల్యాబ్ టెక్నీషియన్లకు బేసిక్ పే వర్తింపజేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీఎంహెచ్‌ఓ హామీ ఇచ్చారు. కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.